## విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలి



కలెక్టర్, ప్రభుత్వసలహాదారు సుదర్శన్‌రెడ్డి

వివరాలు మెయిన్‌లో...


# ప్రజాపక్షం జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్ ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 16 జులై, 2026 | పేజీలు : 08


### పేద, మధ్యతరగతి కుటుంబాలకు

# అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్

**ప్రజాపక్షం/వేములవాడ:** రాష్ట్రంలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి (సి ఎమ్ ఆర్ ఎఫ్) చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణ పరిధికి చెందిన 37 మంది లబ్ధిదారులకు 13 లక్షల 57 వేలు, వేములవాడ అర్బన్ మండల పరిధికి చెందిన 18 మంది లబ్ధిదారులకు 5 లక్షల 66 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వేగంగా ఆర్థిక సహాయం అందించడం వల్ల వారికి ఆర్థిక భారం తగ్గుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ





చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ , మున్సిపల్ కౌన్సిలర్లు తోట రాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కూరగాయల కొమురయ్య,పులి రాంబాబు,నాగుల విష్ణు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### త్వరలోనే కుల సంఘాల భవన నిర్మాణ పనులు ప్రారంభం

వేములవాడ పట్టణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంజూరైన బిసి భవన్,అంబేద్కర్ భవన్, క్రిస్టియన్ భవన్, ఎస్‌టి భవన్,నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం వేములవాడ పట్టణంలో ఆయా భవనాల నిర్మాణానికి స్థలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. నాలుగు భవనాలకు ఒక్కో భవనానికి 1 కోటి 30 లక్షలు మంజూరు కేటాయించగ టెండర్లు కూడా పూర్తి కావడం జరిగింది.భవన నిర్మాణాలకు స్థలాన్ని కేటాయించడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు విప్ సూచించారు. సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడేలా నాణ్యమైన సౌకర్యాలతో ఈ భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. అనంతరం ఫుట్ ఓవర్ బ్రిడ్జి ,తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మూడో బ్రిడ్జి పనులను విప్ పరిశీలించారు. ప్రస్తుతం పనులు తుది దశకు చేరుకున్నాయని, త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలు మరింత సులభతరం అవుతాయని చెప్పారు. అదేవిధంగా తిప్పాపూర్ రైతులు తమ వ్యవసాయ క్షేత్రాలకు సులభంగా చేరుకునేందుకు సర్వీస్ రోడ్డు ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. వేములవాడ పట్టణ అభివృద్ధితో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి అభివృద్ధి పనిని స్వయంగా పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని విప్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు తోట రాజు,ఇప్పపూల అజేయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్, కూరగాయల కొమురయ్య, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రతి విద్యార్థిలో

# అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలి



కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మూడురోజుల ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.అంతర్గాం,పాలకుర్తి, శ్రీరాంపూర్, ఓదెల, పెద్దపల్లి మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయుల తో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు తన బోధనా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకుంటూ ప్రతి విద్యార్థి నిర్దేశిత లెర్నింగ్ అవుట్‌కమ్స్ సాధించేలా కృషి చేయాలని సూచించారు.ముఖ్యంగా చదవడం , రాయడం , విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలు , కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేలా బోధన కొనసాగించాలని తెలిపారు.అభ్యసనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి రిమీడియల్ తరగతులు నిర్వహించడం ద్వారా అవసరమైన విద్యా సహాయాన్ని అందించాలని, ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల్లో అవసరమైన అభ్యసన సామర్థ్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని సూచించారు.మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధస్సు వినియోగం పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో కలెక్టర్ ప్రత్యక్షంగా ముచ్చటించి, శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కృత్యాధారిత బోధన ద్వారా విద్యార్థుల్లో అభ్యసన నైపుణ్యాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన శిక్షణతో పోలిస్తే ఈ ఏడాది శిక్షణలో పొందుపరిచిన ముఖ్యాంశాలను మరోసారి పునశ్చరణ చేసుకుని, వాటిని తరగతి గదిలో అమలు చేసి విద్యార్థులను ఉత్తమ ప్రగతి దిశగా నడిపించాలని ఉపాధ్యాయులకు సూచించారు.అనంతరం పాఠశాలలోని డిజిటల్ క్లాస్ రూమ్ లు, ప్రీ ప్రైమరీ తరగతి గదులు, బోజన శాల తదితర వాటిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు,రిసోర్స్ పర్సన్లు, శిక్షణ నిర్వాహకులు,అంతర్గాం,పాలకుర్తి, శ్రీరాంపూర్, ఓదెల,పెద్దపల్లి మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిజామాబాద్ నుండి

# యుకెకు బియ్యం ఎగుమతులు




లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భారత్‌యునైటెడ్ కింగ్‌డమ్ మధ్య అమలులోకి వచ్చిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం ద్వారా ఎగుమతులకు లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ నగరంలోని గజానన్ రైస్‌మిల్ యాజమాన్యం యునైటెడ్ కింగ్‌డమ్‌కు బియ్యం ఎగుమతులకు అనుమతులు సాధించింది. ఈ మేరకు గజానన్ రైస్‌మిల్ నుండి యుకెకు ఎగుమతవుతున్న సోనా మసూరి ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ బియ్యం నిల్వలతో కూడిన వాహనాలకు కలెక్టర్ ఇలా త్రిపాఠి లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. సీఈటీఏ అమలుతో భారతీయ వ్యవసాయ ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు. తెలంగాణలో నాణ్యమైన వరి ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన నిజామాబాద్ జిల్లా నుంచి యుకెకు బియ్యం ఎగుమతులు ప్రారంభం కావటం జిల్లాకు గర్వకారణమన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేసి విదేశాలకు ఎగుమతి చేయటంతో రైతులకు మెరుగైన ధరలు లభించటంతో పాటు జిల్లాకు మంచి గుర్తింపు వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు కూడా జిల్లా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు పెరిగేలా అధికారులు, ఎగుమతిదారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వీరస్వామి, ఉద్యానవన శాఖాధికారి శ్రీనివాస్, గజానన్ రైస్‌మిల్ ప్రతినిధి హితేష్ పాల్గొన్నారు.

## మురికి కాలువకు త్వరలో కొత్త నిర్మాణం

**ప్రజాపక్షం /ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కోజన్ కొత్తూరు వెళ్లే రోడ్డులో ఉన్న వడ్డెర కాలని ప్రాథమిక పాఠశాల సమీపంలోని శిథిలావస్థకు చేరిన మురికి కాలువను బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీ హెచ్. గణేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా మురికికాలువ దెబ్బతిన్న నేపథ్యంలో వెంటనే నూతన మురికి కాలువ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులను త్వరితగతిన ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో గ్రామ ఉపసర్పంచ్ నాంపల్లి రమేష్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణ ప్రదీప్ పాల్గొన్నారు.

## మినీ ట్యాంక్ నిర్మాణానికి శ్రీకారం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న బిస్మిల్లా మసీద్‌లో భక్తులకు మెరుగైన తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేయనున్న మినీ ట్యాంక్ నిర్మాణ పనులకు బుధవారం మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తమ పాలకవర్గం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. పట్టణంలోని ప్రార్థనా స్థలాలు సహా ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను నిరంతరం చేపడుతున్నామని పేర్కొన్నారు. బిస్మిల్లా మసీదుకు విచ్చేసే భక్తులకు ఎల్లప్పుడూ స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా ఈ మినీ ట్యాంక్ నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముస్లిం మర్కజీ కమిటీ అధ్యక్షుడు అఖ్తర్ జానీ,మున్సిపల్ కమిషనర్ డి. శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల నరేష్,నునుగొండ నరేష్,మాసుల ప్రవీణ్,కాజా అజీముద్దీన్,మున్సిపల్ ఏఈ, నాయకులు ముఖీం,బంగారు కాళ్ల కిషోర్, మైనారిటీ నాయకులు,ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు,స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌కు జువ్వాడి పరామర్శ



**ప్రజాపక్షం/మల్లాపూర్:** గుండంపల్లి మాజీ సర్పంచ్ భూపెల్లి దేవయ్య ఇటీవలే అనారోగ్యానికి గురికాగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు బుధవారం పరామర్శించారు.గుండంపల్లి గ్రామంలోని సగృహంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.వీరి వెంట కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, ఎఎంసి చైర్మన్ పుష్పలత నర్సయ్య,సర్పంచ్ పద్మ నరసయ్య ,మాజీ ఎంపిపి నల్ల రాజన్న,గ్రామ శాఖ అధ్యక్షుడు నాసం తిరుపతి, నాయకులు మాడిశెట్టి చిన్న అంజయ్య,తదితరులు ఉన్నారు.

# ప్రజల ఆకాంక్ష మేరకే గ్రామాల అభివృద్ధి

### వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి



**ప్రజాపక్షం /మల్లాపూర్ :** కోరుట్ల నియోజకవర్గంలో ప్రజల ఆకాంక్ష మేరకు అనుగుణంగా నిధులను మంజూరు చేస్తూ గ్రామాల అభివృద్ధి చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్, వెల్మ కార్పొరేషన్ చైర్మన్ జువ్వడి నర్సింగారావు అన్నారు. ఈ సందర్భంగా గుండంపల్లి ,చిట్టాపూర్, వెంకట్రావు పేట గ్రామాలలో రాష్ట్ర కోఆపరేటివ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డితో కలిసి పర్యటించి అభివృద్ధి పనులకు భూమి పూజ, నిర్మాణంపూర్తయిన పనులను ప్రారంభించారు.గ్రామాలలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులను మంజూరు చేయించి సిసి రోడ్లు డ్రైనేజీ లను నిర్మించి అభివృద్ధి చేస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తామని ప్రజలకు వివరించారు. అంతకుముందు గుండంపల్లి గ్రామంలో జువ్వాడి అభిమానులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి, ఏఎంసి చైర్మన్ పుష్పలత నర్సయ్య, సర్పంచులు దప్పుల పద్మ నరసయ్య, కనుముల వెంకటేష్,ఎలేటి వెంకటరెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు ,అధికారులు పాల్గొన్నారు.

# కొత్త బోరుబావి, పంపు సెట్టు ప్రారంభం



**ప్రజాపక్షం /పెగడపల్లి :** మండలంలోని అయితిపల్లి గ్రామ 5వ వార్డులో కొన్నేళ్లుగా వేధిస్తున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక సహకారంతో వార్డులో నూతనంగా మంచి నీటి బోరుబావి తవ్వించి, పంపు సెట్టును బిగించారు.ఈ వార్డులో నెలకొన్న తాగునీటి ఎద్దడిని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా,ఆయన తక్షణమే స్పందించి సమస్య పరిష్కారం కోసం రెండు లక్షల రూపాయలు (2,00,000/) కేటాయించారు. నిధులు మంజూరు కావడంతో వేగంగా పనులు పూర్తి చేసి,పంపు సెట్టును అందుబాటులోకి తెచ్చారు.దీంతో వార్డు ప్రజల దాహార్తి తీరింది. దశాబ్దాల సమస్యను పరిష్కరించి తమకు తాగునీరు అందించిన మంత్రికి వార్డు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ నీటి పంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో సర్పంచ్ మ్యాకల అంజమ్మ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మంజుల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కదారి తిరుపతి,పార్టీ నాయకులు పుసాల తిరుపతి,తడగొండ రాజు,మూల రాంరెడ్డి, తడగొండ తిరుపతి,పలుమారు ఆంజనేయులు,బొమ్మగోని జితేందర్, ఎండీ రజాక్,బొజ్జం భూమయ్య,కిష్టయ్య, స్థానికులు,తదితరులు పాల్గొన్నారు.

# 18న చెక్ బౌన్స్ స్పెషల్ లోక్ అదాలత్

### సీనియర్ సివిల్ జడినాగేశ్వర్ రావు




**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ఈ నెల 18న నిర్వహించనున్న చెక్ బౌన్స్ స్పెషల్ లోక్ అదాలత్ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు.మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బుధవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెక్ బౌన్స్ కేసుల పెండెన్సీని తగ్గించేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి న్యాయవాది సహకరించాలని కోరారు.వారంట్‌లు జారీ అయిన కేసులతో పాటు, రాజీ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉన్న కేసుల్లో కూడా న్యాయవాదులు చొరవ తీసుకుని కక్షిదారులను లోక్ అదాలత్‌కు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి వి. మాధవి, ఏపీపీ ప్రణయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు వద్దేపల్లి శ్రీనివాసన్, జేడి సుధాకర్, న్యాయవాదులు జిల్లా వెంకటేశ్వర్లు,మగ్గిడి వెంకట నర్సయ్య, కోటగిరి వెంకటస్వామి, పుప్పాల భానుమూర్తి,కటకం వేణుగోపాల్,బక్కూరి రమేష్,పసునూరి శ్రీనివాస్,బిగుర్ల శంకర్, అలాల శంకర్, అందె సంజయ్,తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం తనిఖీ

**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్ :** జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపర్చేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్జెక్టుల వారీ వృత్యంతర శిక్షణా కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు.జిల్లా కేంద్రంలోని జ్ఞాన హైస్కూల్లో ఆంగ్లం సబ్జెక్టుకు నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించిన కలెక్టర్, శిక్షణ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ బోధనను తరగతి గదిలో కూర్చొని ప్రత్యక్షంగా వీక్షించి, ముఖ్యంగా కృత్రిమ మేధను తరగతి గదిలో విద్యార్థుల అభ్యాసానికి ఎలా సమర్థవంతంగా వినియోగించుకోవచ్చనే అంశంపై అందించిన శిక్షణను ఆసక్తిగా పరిశీలించారు.ఆంగ్ల భాష బోధనలో స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థికేంద్రిత బోధనా పద్ధతులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం,కృత్రిమ మేధ ఆధారిత బోధనా విధానాలపై ఉపాధ్యాయులకు సమగ్ర శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూశిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రతి ఉపాధ్యాయుడు తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించడంలో ఆధునిక బోధనా విధానాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి శిక్షణా అవకాశాలను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి వద్ద సిసి రోడ్డు,కల్వర్టు నిర్మాణానికి స్థల పరిశీలన

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి భవనానికి అనుసంధానంగా సీసీ రోడ్డు , డ్రైన్‌పై కల్వర్టు నిర్మాణ పనుల కోసం బుధవారం మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి స్థలాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఇబ్బందులు తలెత్తకుండా మెరుగైన రహదారి, డ్రైనేజీ సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన పనులను త్వరితగతిన చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి రావడానికి అవసరమైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కౌన్సిలర్ నునుగొండ నరేష్,మున్సిపల్ కౌన్సిలర్లు బత్తుల నరేష్,మాసుల ప్రవీణ్, కాజా అజీమ్, మున్సిపల్ కమిషనర్ డి.శ్రీనివాస్ గౌడ్,మున్సిపల్ ఏఈ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా.అమరేశ్వర్, నాయకులు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్. ముఖీం,బంగారు కాళ్ల కిషోర్,ఆసుపత్రి వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## ఉత్తమ పాత్రికేయ అవార్డు గ్రహీత బాశెట్టి హరీష్‌కు సన్మానం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ఇటీవల శ్రీకాళహస్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకున్న మెట్‌పల్లి పట్టణానికి చెందిన పాత్రికేయుడు బాశెట్టి హరీష్ ను ప్రముఖ వైద్యుడు డా. రఘు చిట్నేని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా డా. రఘు చిట్నేని మాట్లాడుతూ, పాత్రికేయ వృత్తి అత్యంత సాహసోపేతమైనదని అన్నారు.ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.ఇలాంటి బాధ్యతాయుతమైన వృత్తిలో ఉత్తమ పాత్రికేయ అవార్డు అందుకోవడం అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా జాతీయ,రాష్ట్ర స్థాయి అవార్డులు మరెన్నో అందుకుని,ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని బాశెట్టి హరీష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెండ్ల రాజన్న,నల్లా వెంకటేష్,మేడిచెల్మల నాని, పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సిసిరోడ్డు నిర్మాణం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** మండలంలోని రాఘవపేట గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సహకారంతోసిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని రెండవ వార్డు , ఎనిమిదవ వార్డులో నిర్మిస్తున్న సిసి రోడ్లకు సర్పంచ్ తోట శ్రీనివాస్ శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కాలనీవాసుల కోరిక మేరకు సిసిరోడ్డు నిర్మించాలని ఎమ్మెల్యేని కోరగా ఎన్ఆర్ఇజిఎస్ నిధులు ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయించారని, ఎమ్మెల్యే దృష్టి కి తీసుకువెళ్లిన వెంటనే సమస్య పరిష్కారానికి దారి చూపిన ఎమ్మెల్యేకు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నరసయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్, వార్డు సభ్యులు భారతి మనోజ్ లక్ష్మీ నరసయ్య, బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు బైరి రవికుమార్ యాదవ్, నాయకులు పుప్పాల వినోద్, గంగారెడ్డి మహిపాల్ శశి కుమార్ ,చిన్నయ్య కమలాకర్, రవి, శంకర్ ,గంగారెడ్డి ,రంజిత్ కాలనీ మహిళలు,తదితరులు ,తదితరులున్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని....



**ప్రజాపక్షం / చందుర్తి :** వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్న వ ర్షాలు సరిగా కురవకపోవడంతో రైతులు , ప్రజ లు చాలా ఇబ్బందులు పడుతున్నారాని ఇకనైనా వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షిస్తూ మండలం లోని తిమ్మాపూర్ గ్రామం లో అన్ని కుల సంఘాల ఆధ్వర్యం లో బుధవారం కప్పతల్లి ఆటలు ఆడినట్లు గ్రామ సర్పంచ్ కపిల్ల శంకర్ తెలిపారు. వర్షాలు సమృద్ధిగా పడితేనే పంటలకు సరిపడా నీరు అందుతుందని దానితో రైతులు , ప్రజలు సంతోషంగా ఉంటారని అన్నారు. అందుకోసమే గ్రామ యువకులు,విడిసి సభ్యులు,కుల సంఘాలు కలిసి గ్రామ దేవతలకు జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశామన్నారు. విడిసిధ్యక్షులు నల్లపు దివాకర్ , ముద్దసాని వెంకటేష్ , ఎడ్ల కుషాలు,గాలిపెల్లి ఎల్లయ్య,గడికొప్పుల శ్రీనివాస్ ,బుర్రి తిరుపతి , అట్టపెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకోసం నవ గ్రహాలకు జలాభిషేకం

**ప్రజాపక్షం / జమ్మికుంట :** వరుణ దేవుని కృపా కటాక్షం లేక రైతులు అల్లాడుతున్న నేపథ్యంలో వరుణ దేవుడు కరుణించి సకాలంలో వర్షాలు కురవాలని కోరుతూ జమ్మికుంట మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల గోవిందాపూర్ గ్రామంలో బుధవారం గ్రామస్తులందరూ నవ గ్రహాలకు జలాభిషేకం నిర్వహించారు. పోచమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన మహిళలు పెద్దఎత్తున ఇంటి నుంచి బయలుదేరి నీళ్లు తీసుకొచ్చి గ్రామ దేవతలతో పాటు నవ గ్రహాలకు జలాభిషేకం చేశారు. పలువురు మాట్లాడుతూ వర్షాలు ఇప్పటికైనా సకాలంలో కురిసేలా వరుణ దేవుడు కరుణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ గోదారి కొంరయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం / జమ్మికుంట :** జమ్మికుంట పట్టణంలో కొంతమంది గోవుల యజమానులు తమ ఆవులను రోడ్లపై వదిలేయడంతో రోడ్లపైనే ప్రసవాలు జరగడంతో ఇప్పటివరకు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయంలో పశు వైద్యాధికారి రాజ్ కుమార్ పర్యవేక్షణలో 4 ఆవులకు సురక్షితంగా ప్రసవాలు జరిపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గో యజమానులు గోవులను రోడ్లపై వదిలివేయడంతో రోడ్డు ప్రమాదాలు జరగడంతోపాటు ట్రాఫిక్‌కు కూడా అంతరాయం కలగడం వంటి సంఘటనలు జరుగుతున్నాయని అన్నారు. గోవులు రోడ్లపై ప్రసవాలు జరగడం ఎంతో బాధాకరమని అందువల్ల గోవుల యజమానులు వారం రోజుల్లో తమ ఆవులను తప్పనిసరిగా తీసుకెళ్లి సంరక్షించుకోవాలని లేనిపక్షంలో వారిపై మున్సిపల్ చట్టాల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

## మానేరులో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలు

**ప్రజాపక్షం / కరీంనగర్ టౌన్:** కరీంనగర్ పద్మనగర్‌లోని సాయి మానేరు సిబిఎస్ఈ పాఠశాలలో బుధవారం స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలను నిర్వహించారు. దేశంలో ప్రజాస్వామ్య పద్ధతిలో సాధారణ ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయో అదే తరహాలో విద్యార్థి ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులతోపాటు మానేరు విద్యా సంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, డైరెక్టర్ కడారి సునీత రెడ్డిలు సైతం పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలు, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన, బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడానికే పాఠశాల స్థాయిలో ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల హెడ్‌బాయ్, హెడ్ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్, కల్చరల్ కెప్టెన్, జనరల్ కెప్టెన్, హౌజ్ కెప్టెన్‌లు, వైస్ కెప్టెన్లను ఎన్నుకొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ రాజు చాకో, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు లేకుంటే బతికున్నా .... లేనట్టే

### కార్పొరేటర్ గడ్డి ప్రదీప్




**ప్రజాపక్షం / కొత్తపల్లి :** ఓటు హక్కు లేకుంటే బతికున్నా మనిషి లేనట్టేనని తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని 14వ డివిజన్ కార్పొరేటర్ గడ్డి ప్రదీప్ అన్నారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదేశాల మేరకు నగరంలోని పద్మనగర్‌లో బస్తీ దవఖాన చౌరస్తా వద్ద కరీంనగర్ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటరు నమోదు, సవరణల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలను మాజీ వైస్ ఎంపిపి భూక్యా తిరుపతి నాయక్‌లతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల కమీషన్ నిర్దేశించిన గడువులోగా ఓటర్ల నమోదు ప్రక్రియను పూర్తి చేయడమే వీటి ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రభుత్వ యంత్రాంగం డివిజన్‌లో ఇప్పటివరకు 30 నుంచి 40 శాతం మాత్రమే ఓటరు సవరణ ప్రక్రియ పూర్తి చేసిందని తెలిపారు. జూలై 24 లోపు మిగిలిన ప్రక్రియను ముగించాల్సి ఉందని ఆన్‌లైన్ సర్వర్లు సరిగ్గా పని చేయకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అందుకోసమే బిఆర్ఎస్ పార్టీ స్వయంగా రంగంలోకి దిగి హెల్ప్ కేంద్రాల ద్వారా ప్రజలకు ఆఫ్‌లైన్‌లో ధరఖాస్తులను పూర్తి చేసేందుకు ఉచిత సేవలను అందిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకొని తమ ఓటు హక్కును భద్రపరుచుకోవాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పేయే ప్రమాదం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో 14, 15 డివిజన్‌ల బిఆర్ఎస్ పార్టీ బిఎల్ఏలు శశిధర్, కిట్టు, వంకాయల రాజు, కళ్యాణ్, పరుశరాం, శ్రీనివాస్ రెడ్డి, రంగ శీను, వినోద్ ఆయా డివిజన్‌లకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# ఓటరు ఎన్యూమరేషన్ మీ సేవ కేంద్రాల్లో ఉచితంగా నమోదు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఓటరు ఎన్యుమరేషన్ ఆన్లైన్ ప్రక్రియను మీ సేవ కేంద్రాల్లో ఉచితంగా సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని ప్రజల సౌకర్యార్థం మీ సేవ కేంద్రాల్లో ఓటరు ఎన్యుమరేషన్ ఆన్లైన్ ప్రక్రియను పూర్తిగా ఉచితంగా చేసే ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సేవకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు లేదా స్వయంగా దరఖాస్తు చేయలేని వారు తమ సమీపంలోని మీ సేవ కేంద్రం లేదా బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) సహాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్యుమరేషన్ సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు.సాంకేతిక పరిజ్ఞానం ఉన్న ఓటర్లు ఓటర్స్ పోర్టల్ ద్వారా కూడా ఇంటి నుంచే స్వయంగా ఎన్యుమరేషన్ సమర్పించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం పోర్టల్‌లో మొబైల్ నంబర్ లేదా ఎపిక్ నంబర్‌తో లాగిన్ అయి, స్పెషల్ ఇన్‌టెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) – ఫిల్ ఎన్యుమరేషన్ ఫామ్(ఇఎఫ్) ఎంపికను ఎంచుకుని,రాష్ట్రం, ఓటరు వివరాలు నమోదు చేయాలని సూచించారు.అనంతరం 2002 ప్రత్యేక ఓటరు జాబితా (ఎస్ఐఆర్)కు సంబంధించిన వివరాలను నమోదు చేయాలని తెలిపారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న వారు తమ అసెంబ్లీ నియోజకవర్గం (ఏసి),పార్ట్ నంబర్, సీరియల్ నంబర్ వివరాలను నమోదు చేయాలని, ఒకవేళ 2002లో ఓటరుగా లేకపోతే పోర్టల్‌లోని సెర్చ్ యువర్ నేమ్‌ఇన్ లాస్ట్ఎస్ఐఆర్ సదుపాయం ద్వారా తల్లిదండ్రులు లేదా అర్హత కలిగిన సమీప బంధువుల 2002 ఎస్ఐఆర్ వివరాలను గుర్తించి నమోదు చేయవచ్చని వివరించారు.వ్యక్తిగత వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా,మొబైల్ నంబర్ తదితర సమాచారాన్ని జాగ్రత్తగా పరిశీలించి అవసరమైతే సవరించాలని, అవసరమైన పత్రాలను అప్‌లోడ్ చేసి వివరాలను మరోసారి ధృవీకరించిన అనంతరం ఆన్లైన్లో సమర్పించాలని తెలిపారు.ఆన్‌లైన్‌లోప్రక్రియ పూర్తయిన వెంటనే అక్నాలెడ్జ్‌మెంట్/ రిఫరెన్స్‌నెంబర్‌ను డౌన్‌లోడ్ చేసుకుని లేదా స్క్రీన్‌షాట్ రూపంలో భద్రపరచుకోవాలని సూచించారు.జిల్లాలోని ప్రతి అర్హ ఓటరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గడువులోగా ఎన్యుమరేషన్ ఆన్లైన్ లో సమర్పించాలని కోరారు. సందేహాలు ఉన్న వారు సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ), ఎన్నికల అధికారులను లేదా సమీపంలోని మీ సేవ కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రైవేట్ టీచర్ల శ్రమను దోచుకుంటున్న స్కూల్ యజమాన్యాలు

**ప్రజాపక్షం/రామగిరి :** రామగిరి మండలం లో ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల శ్రమ దోపిడీ ఆగాలి – కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ తప్పనిసరిగా అమలు చేయాలి ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న అనేక మంది ఉపాధ్యాయులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు విద్యార్థుల నుంచి వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు,అదే పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రం కనీస వేతనాలు కూడా చెల్లించకపోవడం దారుణం.రోజంతా కష్టపడి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు, కొన్నిచోట్ల కాంట్రాక్ట్ కార్మికుల కంటే కూడా తక్కువ వేతనాలు చెల్లించడం సిగ్గుచేటు.అనేక పాఠశాలల్లో ఉద్యోగులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించకపోవడం కార్మిక చట్టాల ఉల్లంఘనగా పరిగణించాల్సిన అంశం.ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ చేయాల్సిన ఎంఈఓ , డీఈఓ అధికారులు ఇటువంటి అంశాలపై సమర్థంగా స్పందించకపోవడం వల్ల యాజమాన్యాలు మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వం వెంటనే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి:ప్రైవేట్ ఉపాధ్యాయులకు కనీస వేతనాలు అమలు చేయాలి. ప్రైవేట్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని బిజెపిమాజీ ఎంపిటిసి ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మెరుగు శ్రీకాంత్ ,దొంతుల సురేష్,పాల్గొన్నారు.

# స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వకపోతే 'చలో ఎఎంఆర్' ఉద్యమం

**ప్రజాపక్షం/ముత్తారం :** తాడిచర్ల ప్రాంతంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎఎంఆర్ సంస్థ స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించకపోతే "చలో ఎఎంఆర్" పే రుతో భారీ ఉద్యమం చేపడతామని బిజెపి రాష్ట్ర నాయకుడు చందుపట్ల సునీల్‌రెడ్డి హెచ్చరించారు. మంథనిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ, స్థానిక ప్రజలు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను కోల్పోయి సంస్థకు అప్పగించినప్పటికీ, వా రికి తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని ఆరోపి ంచారు. డ్రైవర్,సూపర్వైజర్ వంటి సాధారణ ఉద్యోగాల కోసం పలుమార్లు కంపెనీ అధికారులను సంప్రదించినా స్పందన లేదని విమర్శించారు.కొద్దిమందికి మాత్రమే ఉ ద్యోగాలు ఇచ్చి,వారికి కూడా నెలకు రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని,ఆ జీతాలతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారిందన్నా రు. తాడిచర్ల ప్రాంతం బొగ్గు ఉత్పత్తికి కేంద్రంగా ఉన్నప్పటికీ,ఆ ప్రాంత అభివృద్ధిని ఎఎంఆర్ సంస్థ పట్టించుకోవ దం లేదని ఆరోపించారు. సంస్థ తన విధానాన్ని మార్చుకుని స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాల ని, లేకపోతే నియోజకవర్గ యువతతో కలిసి "చలో ఎఎం ఆర్" ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.అవసరమైతే ఈ అంశాన్ని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్తామ ని,స్థానికుల హక్కులు,ఉద్యోగాల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## పారమితలో క్రీడా సాంస్కృతిక గృహాల వేడుకలు

**ప్రజాపక్షం /కొత్తపల్లి :** కొత్తపల్లి మండలంలోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాలలో బుధవారం క్రీడ సాంస్కృతిక గృహాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించగా పాఠశాల క్రమశిక్షణలో భాగంగా విద్యార్థులను ఆజాద్, బోస్, రూస్సో, తిలక్ అనే నాలుగు గృహాలుగా విభజించి వాటికి హౌస్ మాస్టర్, కో హౌజ్ మాస్టర్, కెప్టెన్, వైస్ కెప్టెన్లను నియమించి వారికి బ్యాడ్జీలను అందజేసి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు హౌస్‌ల వారిగా పోటీలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గృహాల వారిగా కవాతును నిర్వహించి అతిథులకు గౌరవ వందనం చేశారు. హౌస్ మాస్టర్స్ గృహాలవారిగా పతకాలను ఎగురవేసి వారి బృందాన్ని పరిచయం చేశారు.ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాదరావు మాట్లాడుతూ క్రీడా గృహాలు విద్యార్థుల మధ్యలో ఉన్నతమైన విలువలు, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, రశ్మిత, అనుకర్ రావు, వినోద్ రావు, రాకేశ్, వియయం ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపికృష్ణ, సమన్వయకర్తలు రభీంద్ర పాత్రో, భవానీ, నిఖిత, హౌస్ కన్వీనర్స్ విజయ్, యస్.రాజు, సాంస్కృతిక సమన్వయకర్త సుష్మ, హౌస్ మాస్టర్లు, హౌస్ కెప్టెన్లు, పిఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపి,పిఎంపి వైద్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ప్రజాపక్షం/ముత్తారం :**గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో ఆర్ఎంపీ,పీఎంపీ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారని మంథని డివిజన్ అధ్యక్షుడు, నూతన కరీంనగర్ జోనల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.వి.చారి తెలిపారు.ఆర్ఎంపీ,పీఎంపీ వైద్యుల సంక్షేమం,వారి వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం తాము నిరంతరం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యుల హక్కుల పరిరక్షణ,సంక్షేమం,శిక్షణ కార్యక్రమాలు, ప్రభుత్వ గుర్తింపు తదితర కీలక అంశాలను సంఘం తరపున ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడమే తమ ప్రధాన ధ్యేయమని చెప్పారు.సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు సభ్యులంతాఐక్యతతోముందుకుసాగాలని డాక్టర్ చారి పిలుపునిచ్చారు.

## నేరాల నియంత్రణలో అధికారులు అప్రమత్తత



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నేరాల నియంత్రణలో పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్థవంతమైన పోలీసింగ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గీతే అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వేములవాడ సబ్ డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాంతిభద్రతలు, నేరాల నియంత్రణ, పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాల నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన, పోలీసింగ్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుత ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, శాస్త్రీయ ఆధారాలతో పటిష్టమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ–సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు.దొంగతనం కేసులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో త్వరితగతిన ఛేదించి, దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, రవీందర్, మొగిలి, మధుకర్, ఆర్ఐలు మధుకర్, సురేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న అధికారికి సన్మానం

**ప్రజాపక్షం/రామగిరి:** రామగుండం3 ఏరియా లోని ఒసిపి2 ఉపరితల గని నందు ప్రాజెక్ట్ ఇంజినీర్ గా విధులు నిర్వహిస్తూ రామగుండం2 ఏరియా ఇంజినీర్ గా బదిలీ పై వెళ్తున్న యం.వి.ఎన్.ఎ.చంద్రశేఖర్ ను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, వివిధ విభాగాల అధిపతులు బుధవారం జిఎం కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు,అభినందనలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరియాలో విధేయతతో, అంకిత భావంతో వారు అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్వోటుజియం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ ఉదయ భాస్కర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ జె.రాజశేఖర్, విభాగాధిపతులు రాజా రెడ్డి,ఐలయ్య, రవి చరణ్,షబ్బీరుద్దీన్,ఆర్.రాజేశ్వరి,పా పయ్య,ఆసిఫ్‌యాసిన్,వంశీధర్,ప్రవీణ్, మేఘన,తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఇబ్రహీంపట్నం విద్యార్థిని ఎంపిక

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని జెడ్‌పిహెచ్‌ఎస్ పిఎం శ్రీ స్కూలుకు చెందిన విద్యార్థిని మంగలరపు మహతి 2000 మీటర్ల పరుగు పందెంలో రజత పతకం, 1000 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ మహతిని మెడల్, ప్రశంసాపత్రంతో సత్కరించి అభినందించారు. అనంతరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం. రాజన్న, ఫిజికల్ డైరెక్టర్ రాజు మహతి రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించగా,ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

## పశువులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** పశు వైద్య ,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని తిర్మాలాపూర్ (పిడి ), రంగధాముసపల్లి గ్రామంలో బుధవారం పశువులకు సోకే మాదకరమైన లంపీ స్కిన్ డిసీజ్ (ముద్ద చర్మవ్యాధి )నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లు కాస అంజలి గంగాధర్,జెల్లా అఖిల అనిల్ పాల్గొని పశువులకు టీకాలు వేసే ప్రక్రియను ప్రారంభించి,వ్యాధి నివారణ పై రైతులకు అవగాహన కల్పించారు.లంపీ స్కిన్ వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా టీకాలు వేయించడం ఎంతో ముఖ్యమని రైతులందరూ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఈ సందర్భంగా కోరారు.తిరుమలాపూర్, రంగరాముసిపల్లి గ్రామాలలోని 150 కి పైగా ఆవులు,ఎద్దులు,లేగ దూడలకు ముద్ద చర్మ వ్యాధి నిరోధక టీకాలను అందించారు. గొర్రెలు ,మేకలలో పి పి ఆర్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉంటుంది కావున గొర్ల మేకల పెంపక దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.సర్పంచ్‌లు కాస అంజలి గంగాధర్ ,జెల్లా అఖిల అనిల్ ,మండల పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్,పశు వైద్య సిబ్బంది ,తిరుమలాపూర్ ఉప సర్పంచ్ మస్కం అంజి, వార్డు సభ్యులు రైతులు పాల్గొన్నారు.

# నీటి లభ్యతను బట్టి రైతులు పంటల ఎంపిక

### మండల ఉద్యానవన విస్తరణ అధికారి రాము

**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:** వెల్లినో ప్రభావం వల్ల రైతులు నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని మండల ఉద్యానవన విస్తరణ అధికారి బి రాము అన్నారు. బుధవారం రోజున ఓదెల మండలం లోని కనగర్తి, ఓదెల, మడక, పొత్కపల్లి శివార్లలోని తీగ జాతి పందిళ్లలో మల్చింగ్ తో సాగు చేస్తున్న కూరాగయ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూముఖ్యంగా రైతులు ప్రస్తుత వానాకాలం 2026 సీజన్ లో ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షాలు ఆలస్యంగా కురిసే అవకాశం,మధ్యలో దీర్ఘాకాలిక వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడే అవకాశం ఉందని, ప్రాజెక్టులు చెరువులు , కాలువలు పూర్తిస్థాయిలో నిండకపోవచ్చనీ.భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బావులు బోర్లలో నీటి లభ్యత కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందనీ అందువల్ల రైతులు అందుబాటులో ఉన్న నీటి లభ్యతను అంచనా వేసుకొని పంటల సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను అంచనా వేసుకుని మాత్రమే పంటల ఎంపిక చేసుకోవాలని,వరి సాగును అందుబాటులో ఉన్న నీటికి అనుగుణంగా పరిమిత విస్తీర్ణంలో మాత్రమే చేపట్టి స్వల్ప కాలిక వరి రకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని,ఆరుతడి పంటలు కూరగాయలు, ఆకుకూరలు వంటి తక్కువ నీరు అవసరం అయ్యే ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని,60 75 మిల్లీమీటర్ల వరకు సమృద్ధిగా వర్షపాతం వచ్చిన తర్వాత విత్తనాలు వేయాలని,బిందు తుంపర సేద్యం పద్ధతులను ఉపయోగించి ప్రతినిధి చుక్కను సద్వినియోగం చేసుకోవాలని, ప్రస్తుతం బావులు



లేదా బోర్లలో నీరు ఉందని భావించి అధిక విషయంలో వర్షాలు చేపట్టవద్దనీ, ఎల్నినో ప్రభావంతో భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉందనీ,కూరగాయల సాగులో మేలైన మల్చింగ్ పద్ధతిలో సాగు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పనాస అశోక్,బోడకుంట్ల అనిల్, రాజు,రాజు,కూరగాయల రైతులు,తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎస్ఐ,కానిస్టేబుల్ ఉచిత శిక్షణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో త్వరలో నిర్వహించనున్న ఎస్ఐ, కానిస్టేబుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న పెద్దపల్లి జిల్లా యువతకు నిర్వహించనున్న పోలీస్ యువశక్తి ఉచిత శిక్షణ ఎంపిక కార్యక్రమం పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న పెద్దపల్లి జిల్లా యువతీ,యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులకు నాణ్యమైన ఉచిత శిక్షణ అందించడం ద్వారా రాష్ట్ర పోలీస్ నియామకాల్లో జిల్లా నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు విజయాలు సాధించేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉచిత శిక్షణ కోసం అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను జూలై 19 (ఆదివారం) ఉదయం 6 గంటలకు గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (సీఈఆర్ క్లబ్)లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.పురుష అభ్యర్థులకు 1,600 మీటర్ల పరుగు, మహిళా అభ్యర్థులకు 800 మీటర్ల పరుగు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ అవకాశం పెద్దపల్లి జిల్లా అభ్యర్థులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు జూలై 17,2026లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.మరిన్ని వివరాలకు 8333044460, 994972 5997,81 068077 84, 9573688952 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ప్రవీణ్ రెడ్డి,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** నవజాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సంకల్ప్ లో భాగంగా నవజాత శిశువుల మరణాల నివారణ తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల గైనకాలజిస్టులు, చిన్న పిల్లల వైద్య నిపుణులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నవ జాత శిశువుల మరణాల శాతం జాతీయ సగటు కంటే తక్కువగా ఉందని తెలిపారు. జిల్లాలో మరణాలు సున్న శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా అన్ని ఆరోగ్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. అందరి వైద్య పరీక్షల వివరాలు భద్రపర్చాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు ఎక్కువ సంఖ్యలో అయ్యేలా చూడాలని ఆదేశించారు. హై రిస్క్ గర్భిణులకు మాత్రమే సీ సెక్షన్ ఆపరేషన్లు చేయాలని స్పష్టం చేశారు. బాలింతలు అప్పుడే పుట్టిన పిల్లలకు పాలు ఇవ్వడం, ఇతర జాగ్రత్తలపై వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే పుట్టిన బిడ్డను మొదటి గంటలోగా తల్లి వద్దకు చేర్చాలని తెలిపారు. నెలలు నిండని, తక్కువ బరువుతో పుట్టిన నవ జాత శిశువులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జిల్లా పంచాయతీ అధికారి జయశీల, డీ సీ హెచ్ ఎస్ రవీందర్, మెడికల్ ఆఫీసర్లు, గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినుల ఆరోగ్య సంరక్షణే ఉజ్వల భవిష్యత్తుకు పునాది

### ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** విద్యార్థి దశలో చదువు ఎంత ముఖ్యమో శారీరక, మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యమని ఈ రెండూ సమపాళ్లలో ఉన్నప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలరని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎల్లాల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.బుధవారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల (కేజీబీవీ ) ఆవరణలో లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో విద్యార్థినుల ఆరోగ్యం, ఉజ్వల భవిష్యత్తుపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి రెండు గంటల పాటు విద్యార్థినులతో ఎంతో ఆత్మీయంగా ముఖాముఖి (ఇంటరాక్ట్) మాట్లాడారు. చదువులో రాణించడానికి ఒత్తిడిని ఎలా జయించాలి, జ్ఞాపకశక్తిని ఎలా పెంపొందించుకోవాలి, కౌమార దశలో ఎదురయ్యే శారీరక మార్పులుఆరోగ్య సమస్యలపై విద్యార్థినులకు ఎంతో సరళంగా అద్భుతంగా వివరించారు.నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పోషకాహారం తీసుకుంటూ లక్ష్యాల వైపు ఎలా అడుగులు వేయాలో దిశానిర్దేశం చేస్తూ విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం కార్యక్రమానికి అధ్యక్షత వహించిన లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ బొమ్మెన కుమార్ మాట్లాడుతూ వీ సర్వ్ (సేవే పరమావధి) అనే ఏకైక నినాదంతో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పనిచేస్తోందని గుర్తుచేశారు. సమాజానికి సేవ చేయడంలో ముఖ్యంగా మన రేపటి పౌరులైన విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఎల్లప్పుడూ ముందుంటుందని గర్వంగా ప్రకటించారు.ప్రభుత్వ పాఠశాలల ప్రగతికి మౌలిక వసతుల కల్పనకు తమ క్లబ్ తరఫున నిరంతరం తోడ్పాటునందిస్తామని భరోసా ఇచ్చారు. ఇంతటి మంచి కార్యక్రమానికి పూర్తి సహకారం అందించిన కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ పద్మ ,ఇన్చార్జి ప్రిన్సిపల్ భానుప్రియ, శైలజ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లయన్స్ క్లబ్ కార్యదర్శి మహంకాళి చంద్రశేఖర్, కోశాధికారి సట్ట సురేష్, పాస్ట్ ప్రెసిడెంట్ ముస్కు కరుణాకర్ రెడ్డి, పాస్ట్ కార్యదర్శి సాయిని నరహరి,క్లబ్ సభ్యులు,పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రంథాలయానికి నిధులు మంజూరు

**ప్రజాపక్షం/కోరుట్ల :** సి.ప్రభాకర్ స్మారక గ్రంథాలయం లో అదనపు రీడింగ్ రూమ్ నిర్మాణమునకు ఎస్. డి.ఎఫ్. నిధుల నుండి నాలుగు లక్షల రూపాయలు నిధులు అందించి నిర్మాణం చేపట్టడం జరిగింది.ఈ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య అనిల్ ప్రభుత్వానికి నివేదికలు పంపించి పేద విద్యార్థులు ఈ గ్రంథాలయంలో చదివి ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లు వచ్చినప్పుడు వారికి అన్ని విధాలుగా తోడ్పడుతున్న సి. ప్రభాకర్ స్మారక గ్రంథాలయం అభివృద్ధికి సహకరించిన వారికి సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ పురపాలక సంఘం చైర్మన్ తిరుమల వసంత గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్ అన్నం అనిల్, సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం, గ్రంథాలయం కమిటీ నేతలు రాస భూమయ్య,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు, సుతారి గంగమని, నరేందర్, సిపిఐ నేతలు ఎండి. ముక్రం, ఏన్నం రాధా, రాచకొండ పెద్ద దేవయ్య,ఎండి ఉస్మాన్,రామిళ్ళ రాంబాబు,పాతర్ల విజయ్, నగేష్, రమేష్,అందే వంశీకృష్ణ,ఎండి సమీర్, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు మాఫీ చేసి.. వరద కాలువ రివర్స్ పంపులు ప్రారంభించాలి

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి మండల సర్పంచ్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు మండలంలోని సర్పంచ్‌లు వినతిపత్రం సమర్పించారు.గ్రామ పంచాయతీలపై పేరుకుపోయిన విద్యుత్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేయాలని వారు కోరారు.అదేవిధంగా, సాగునీటి కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వరద కాలువల రివర్స్ పంపులను తక్షణమే ప్రారంభించి పంటలకు అవసరమైన నీటిని అందించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.గ్రామ పంచాయతీల ఆర్థిక భారం తగ్గించే దిశగా విద్యుత్ బిల్లులను మాఫీ చేయడంతో పాటు,రైతుల పంటలను రక్షించేందుకు వరద కాలువల రివర్స్ పంపులను వెంటనే ప్రారంభించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సర్పంచ్‌లు విజ్ఞప్తి చేశారు. మెట్‌పల్లి మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొని తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలో నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల నేపథ్యంలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ముత్తారం,అడవిశ్రీరాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాల జాతర

**ప్రజాపక్షం/జగిత్యాల :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎలుక భావివాడలో బుధవారం గంగపుత్రుల ఆధ్వర్యంలో బోనాల పండుగ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు .ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తినెత్తుకొని ఊరేగింపు నిర్వహించారు. యువతులు , యువకులు డిజే చప్పులతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డి వేడుకల్లో పాల్గొని గంగపుత్ర సంఘ నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మహిళలు గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్ సిరికొండ వరలక్ష్మి శ్రీనివాస్,నాయకులు రాజన్న, నరేష్,రజనీకాంత్,వెంకటి,శంకర్,దేవేందర్, కిరణ్ ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలి

### గ్రామస్థుల డిమాండ్

**ప్రజా పక్షం / వాంకిడి :** వాంకిడి మండలంలోని కొన్ని గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు ఆశించిన స్థాయిలో లేవని, దీనిపై విద్యాశాఖ అధికారులు సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేశారు. బుధవారం సామేల గ్రామంలోని ఒడ్డెరవాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పరిస్థితిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. 2023లో సుమారు రూ.9.45 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనం అందుబాటులోకి వచ్చినప్పటికీ విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడంలో లోపాలు ఉన్నాయని ఆరోపించారు. భవనాల నిర్మాణం మాత్రమే సరిపోదని సమర్థవంతమైన బోధన, విద్యార్థుల అభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తల్లిదండ్రులు పేర్కొన్నారు. సామేల గ్రామంలోని మరో ప్రభుత్వ పాఠశాలలో సింగిల్ టీచర్ వ్యవస్థ కొనసాగుతుండటంతో ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతులకు బోధనతో పాటు పరిపాలనా బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోందని వివరించారు. దీని వల్ల పఠన రచనా నైపుణ్యాల అభివృద్ధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, తాగునీటి సౌకర్యం, పనిచేయని చేతిపంపులు, మరుగుదొడ్ల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి లోపాలను సరిదిద్దాలని కోరారు.

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజా పక్షం/మందమర్రి :** మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 17న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హైదరాబాద్ మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఈ శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో వివిధ రకాల దీర్ఘకాలిక, సాధారణ ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద విధానంలో వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తగిన చికిత్సలు, ఆరోగ్య సూచనలు అందించనున్నట్లు వివరించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విశ్వనాథ మహర్షి, నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఇంటింటికి పూలు పండ్ల మొక్కల పంపిణీ

**ప్రజా పక్షం / జన్నారం :** జన్నారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పంచాయతీలో హోమ్‌స్టెడ్ పథకం కింద ప్రతి ఇంటికి పూలు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. బుధవారం ఈ గ్రామంలోని నర్సరీని డిఆర్‌డిఓ కిషన్ సందర్శించి వన మహోత్సవం కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంపిణీ చేసిన మొక్కలను ప్రతి ఒక్కరూ సంరక్షించి పెంచాలని కోరారు. పచ్చదనం పెంపొందించేందుకు గ్రామస్థులు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎంపిడిఓ షరీఫ్, రవీందర్, హెచ్‌ఆర్ మేనేజర్, ఏపిఓ, టిఏ, ఫీల్డ్ అసిస్టెంట్, సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అందరి చూపు ఆకాశం వైపు..చినుకు కోసం !

### తేమ లేక ఎండిపోతున్న పత్తి చేను

### వర్షాలు లేక దిక్కుతోచని స్థితిలో రైతాంగం



**ప్రజాపక్షం/ మావలః** జిల్లాలో వర్షాలు ముఖం చాటేయడంతో రైతాంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ''ఎప్పుడు మబ్బులు కమ్ముకుంటాయో.. ఎప్పుడు వానచినుకు నేలను తాకుతుందో.. ఎండల వేడికి ఎండిపోతున్న భూమి దహనాన్ని ఎప్పుడు తీరుస్తుందో'' అని జిల్లా రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. వానకాలం సీజన్ ప్రారంభమై రోజులు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. వరుణుడిపై భారమేసి సాగు మొదలుపెట్టిన రైతులకు కాలం కలిసిరావడం లేదు. పంటలు వేసి, విత్తనాలు మొలకెత్తిన తరుణంలో వానలు లేకపోవడంతో మొలక దశలోనే పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడింది.

### భూమిలో తగ్గిన తేమ.. పత్తి రైతుల్లో తీరని ఆందోళన

ఈ ఏడాది విత్తనం వేసినప్పటి నుంచి జిల్లాలో కేవలం అక్కడక్కడా కొద్దిపాటి జల్లులు మాత్రమే కురిశాయి. దీనివల్ల భూమిలో తేమ శాతం చాలా తక్కువగా నమోదైంది. పత్తి పంటకు ఈ సమయంలో తగినంత వర్షపాతం అత్యంత అవసరం కాగా, నేల ఎండిపోతుండటంతో పత్తి రైతులు తీవ్ర అయోమయంలో పడ్డారు. వందల రూపాయలు పెట్టి కొన్న విత్తనాలు, వేల రూపాయల పెట్టుబడులు మట్టిపాలవుతాయోమోనని అన్నదాతలు గుబులు చెందుతున్నారు. ఇప్పటికైనా వాతావరణం అనుకూలించి వర్షాలు కురిస్తేనే పంటలు బతికి బట్టకడతాయని, లేదంటే తమకు భారీ నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**ప్రజా పక్షం / జైనూర్ :** నేచురల్ ఫార్మింగ్ పథకంలో భాగంగా ఎంపిక చేసిన 125 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని జంగావ్ లో స్థానిక సర్పంచ్ పెందూర్ అనుసయాతో కలిసి ఎఇఒ రాజేంద్ర నేత ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి లేని వ్యవసాయం మార్కెట్ నుంచి ఖరీదైన రసాయన ఎరువులు పురుగుల మందులు కొనాల్సిన అవసరం లేకుండా ఇంట్లోనే లభించే ఆవు పేడ మూత్రం వృక్ష కషాయాల ద్వారా జీవామృతం ఘనజీవామృతం తయారు చేసుకునే విధానాలను వివరించారు. దీని వల్ల సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. రసాయనాల వాడకం వల్ల దెబ్బతింటున్న భూమిని కాపాడుకోవడానికి నేలలో సేంద్రీయ కర్బనాన్ని మిత్ర పురుగులను పెంచడానికి ప్రకృతి వ్యవసాయం ఒక్కటే మార్గమని తెలిపారు. విషపూరిత రసాయనాలు లేకుండా పండించే పంటలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని




ఇలాంటి పంటలకు మార్కెట్లో మంచి ధర డిమాండ్ ఉంటుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నీటి వినియోగం తగ్గుతుందని భూగర్భ జలాలు కలుషితం కాకుండా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. పథకం కింద ఎంపికైన 125 మంది రైతులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సాంప్రదాయ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తూ లాభాలు గడించాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సిఆర్‌పి అంజనా, పెందూర్ అనుసయా, రైతులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

### జిల్లా రైతు సంక్షేమ సంఘం

### జిల్లా అధ్యక్షుడు బొట్టుపెల్లి జైరామ్

**ప్రజా పక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపెల్లి జైరామ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వాంకిడి మండల కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సాగు సీజన్ ప్రారంభమైన వెంటనే రైతులకు అవసరమైన యూరియా, డిఎపి, కాంప్లెక్స్ ఎరువులు, సూక్ష్మ పోషకాలు వంటి ఎరువుల కోసం రైతులు దుకాణాల చుట్టూ తిరుగుతున్నా కొందరు వ్యాపారులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను ఆర్థికంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. కొన్ని ఎరువుల దుకాణాల్లో రైతులకు తప్పనిసరిగా ఇతర ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ఒత్తిడి



చేస్తున్నారని కొందరు రైతులకు బిల్లులు కూడా ఇవ్వకుండా నగదు తీసుకుని విక్రయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. తనిఖీలు కేవలం నామమాత్రంగా జరుగుతున్నాయని నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణాలపై కఠిన చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర కంటే ఒక్క రూపాయి కూడా ఎక్కువకు విక్రయించినా సంబంధిత డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారి లైసెన్సులను రద్దు చేయాలని కోరారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన సంబంధిత వ్యవసాయ అధికారిని వెంటనే బదిలీ చేసి రైతుల పట్ల బాధ్యతతో పనిచేసే అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## 108 అంబులెన్స్ సేవలను తనిఖీ చేసిన అధికారులు

**ప్రజా పక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలోని 108 అంబులెన్స్‌ను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల ప్రోగ్రామ్ ఆఫీసర్ సామ్రాట్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఈఎంఈ కొండల్‌రావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు అంబులెన్స్‌లో ఉన్న వైద్య పరికరాలు, ఔషధ నిల్వలు, అత్యవసర చికిత్సకు అవసరమైన సామగ్రి, వాహనం పనితీరును పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. వర్షాకాలంలో అత్యవసర కేసులు పెరిగే అవకాశం ఉన్నందున అంబులెన్స్‌ను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కాల్ వచ్చిన వెంటనే ఘటన స్థలానికి చేరుకుని ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించాలని కోరారు. ఎప్పటికప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకుని సేవల నాణ్యతను మెరుగుపరుచుకుంటూ మండల ప్రజలకు ఉత్తమమైన అత్యవసర వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో 108 అంబులెన్స్ వైద్య సాంకేతిక నిపుణుడు ప్రవీణ్, అంబులెన్స్ పైలట్ సాయి పాల్గొన్నారు.

## నేరడిగొండ జూనియర్ కళాశాలలో 'మీకోసం ఆదిలాబాద్ పోలీస్'

**ప్రజాపక్షం/ నేరడిగొండః** నేరడిగొండ మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థులకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచనల మేరకు బుధవారం పోలీస్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆదిలాబాద్ పోలీసులు 'మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ... ముఖ్యంగా యువత డ్రగ్స్ అలవాట్లకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం పనిచేసే షీ టీంల పనితీరు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర సమయాల్లో డయల్ 100 సేవలను ఎలా ఉపయోగించుకోవాలో వివరించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా ఎదుర్కొనే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని, సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సురేష్, సోనేరావు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పెన్నుల పంపిణీ

**ప్రజాపక్షం/ నేరడిగొండః** మండలంలోని గుత్పాల గ్రామ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఏకల్ అభియాన్ సంస్థ సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. సంస్థ జిల్లా ఇన్‌చార్జ్ సభ్యులు ఉడుగుల అభిలాష ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు విద్యా సహాయం అందించాలనే ఉద్దేశంతోనే ఏకల్ అభియాన్ సంస్థ ద్వారా నోట్ పుస్తకాలు, పాఠశాల సామాగ్రీలను అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఏకల్ టీచర్ కోట్నాక్ శారద, పాఠశాల ఉపాధ్యాయులు అడే అర్జున్, అంగన్‌వాడీ టీచర్ తిరుతమ్మ, దావుల దినేష్, పెందూర్ భూమన్న, సంతోషిణి పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుడి కుమారుడు డిఎస్‌పిగా ఎంపిక

### మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ

**ప్రజా పక్షం / మందమర్రి :** సింగరేణి కార్మికుడి కుమారుడు గ్రూప్ 1లో విజయం సాధించి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా ఎంపిక కావడం కార్మిక కుటుంబాలకే గర్వకారణమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ కొనియాడారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ మైన్ లో కన్వేయర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న డి రవీందర్ కుమారుడు డి ప్రవీణ్ కుమార్ ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాల్లో ప్రతిభ చాటుకొని డిఎస్‌పిగా ఎంపికయ్యారు. ఆయన పెద్దపల్లి డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్న సందర్భంగా బుధవారం మందమర్రి ఏరియా జిఎం కార్యాలయంలో జీఎం ఎన్ రాధాకృష్ణ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ కార్మిక కుటుంబం నుంచి వచ్చిన ప్రవీణ్ కుమార్ కృషి పట్టుదలతో అత్యున్నత స్థాయికి చేరుకోవడం ప్రతి సింగరేణి ఉద్యోగి కుటుంబానికి ఆదర్శమన్నారు. తండ్రి రవీందర్ తన కుమారుడికి మంచి విద్యను అందించి ఉన్నత స్థానంలో నిలబెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. డీఎస్పీగా ఎంపికైన ప్రవీణ్ కుమార్ తన విధుల్లో నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షించారు. సింగరేణి కార్మికులు గనుల్లో విధులు నిర్వహించే సమయంలో రక్షణ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా పనిచేయాలని సూచించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు తమ పిల్లల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఎం ఎన్ రాధాకృష్ణ, డి రవీందర్, డి ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



## పర్యావరణ పరిరక్షణే భావితరాలకు గొప్ప కానుక

**ప్రజాపక్షం/భైంసా :** పర్యావరణ పరిరక్షణే భావితరాలకు గొప్ప కానుక అనే సందేశంతో భైంసాలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో పూల మొక్కల నాటడం కార్యక్రమాన్ని నిర్వహించారు.కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రఘునాథ్ మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ప్రకృతిని కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అని,నేడు నాటిన ఒక్కో మొక్క రేపటి సమాజానికి ప్రాణవాయువును అందించే జీవనాధారమని అన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. ఓం ప్రకాష్ , నహేదా తపస్సుం మాట్లాడుతూ,మొక్కలను నాటడం మాత్రమే కాకుండా వాటిని పరిరక్షించడం కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ భీమారావు, డాక్టర్ యు.రవి కుమార్, డాక్టర్ శంకర్,డాక్టర్ సంతోష్ కుమార్,ఆరె రాజు,కిషన్, సురేందర్,రామ్ మోహన్,అబ్దుల్లా,మజర్, ఇర్ఫాన్,సాయినాథ్ పటేల్,శ్రీనివాస్,అక్తర్ రసూల్ తదితర అధ్యాపకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి.జి.జానకి షర్మిల

**ప్రజాపక్షం/భైంసా :** భైంసా పట్టణంలోని భైంసా రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి.జి.జానకి షర్మిల,పాల్గొని,పోలీసు అధికారులు, సిబ్బంది,కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజిబిపి) విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా విద్యార్థినులు జిల్లా ఎస్పీని ఆప్యాయంగా పలకరించగా,ఆమె విద్యార్థినులతో ముచ్చటిస్తూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులకు చాక్లెట్లు, అరటిపండ్లు పంపిణీ చేసి వారిని అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వనమహోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు అత్యంత కీలకమని, నేటి అవసరాల కోసమే కాకుండా భావితరాల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం కూడా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి, దానిని చెట్టుగా ఎదిగే వరకు బాధ్యతగా సంరక్షించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, ఐపీఎస్, ఇన్స్పెక్టర్లు ప్రవీణ్ కుమార్, రవీంద్ర నాయక్, సాయి కుమార్,దీపక్,ఎస్ఐలు అశోక్, సుప్రియ, జుబేర్,నవనీత్ ,పోలీసు సిబ్బంది,కెజిబిపి ఉపాధ్యాయులు,120 విద్యార్థినులు పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు.



## రహదారి లేక పిప్పర్‌గొంది ప్రజల నరకయాతన



**ప్రజాపక్షం/వాంకిడి :** వాంకిడి మండలంలోని పిప్పర్ గొంది గ్రామ ప్రజలు దశాబ్దాలుగా సరైన రహదారి సౌకర్యం లేక నరకయాతన అనుభవిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి గ్రామానికి వెళ్లే కచ్చా రహదారి పూర్తిగా బురదమయంగా మారి చెరువును తలపిస్తోంది. ప్రతి చిన్న వర్షానికి కాలినడకన ప్రయాణించడం కూడా సాధ్యం కాని పరిస్థితి నెలకొనడంతో విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గ్రామస్తుడు రామ్ భావ్ చవాన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో దశాబ్దాలు గడిచినా తమ గ్రామానికి కనీస మౌలిక సదుపాయమైన రహదారి సౌకర్యం కల్పించకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడితే గ్రామానికి వెళ్లే మార్గం పూర్తిగా దెబ్బతిని అడుగు ముందుకు వేయలేని పరిస్థితి ఏర్పడుతోందని చెప్పారు. దారి మధ్యలో ఉన్న వాగులు, ఒర్రెలు వర్షపు నీటితో ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయని, ప్రజలు గంటల తరబడి వాగుల వద్దే వేచి ఉండాల్సి వస్తోందని వివరించారు. కొన్నిసార్లు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను పణంగా పెట్టి వాగులు దాటాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామానికి సరైన దారి లేకపోవడం వల్ల అత్యవసర వైద్య సేవలు అవసరమైన సమయంలో అంబులెన్స్ సైతం రాలేకపోతోందని, దీంతో గర్భిణీలు, వృద్ధులు ప్రాణాపాయ స్థితిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులు ప్రతిరోజూ బురదలోనే నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోందని, వర్షం ఎక్కువగా కురిసిన రోజుల్లో వాగులు దాటలేక చదువుకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. రవాణా సౌకర్యం లేకపోవడంతో రైతులు తమ పంటలను సకాలంలో మార్కెట్‌కు తరలించలేక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో గ్రామ అభివృద్ధి, రహదారి, వంతెనల నిర్మాణం చేస్తామని పెద్దఎత్తున హామీలు ఇచ్చే రాజకీయ నాయకులు.. గెలిచిన తర్వాత గ్రామాన్ని పూర్తిగా మరిచిపోతున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పిప్పర్‌గొంది గ్రామానికి అన్ని కాలాల్లో ఉపయోగపడే విధంగా సీసీ లేదా బీటీ రహదారిని నిర్మించాలని, రాకపోకలకు ఆటంకంగా మారిన వాగులు, ఒర్రెలపై శాశ్వత వంతెనలను నిర్మించాలని రామ్ భావ్ చవాన్ డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని, ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి తమ దశాబ్దాల రహదారి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## వాంకిడి గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించాలి

### జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కాంబ్లె అనిల్ కుమార్‌కు సిపిఐ వినతి



**ప్రజా పక్షం / వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించి విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కాంబ్లె అనిల్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల సహాయ కార్యదర్శి కోదురుపాక మహేష్ మాట్లాడుతూ ప్రస్తుతం వాంకిడి గ్రంథాలయం తాత్కాలిక భవనంలో కొనసాగుతుండటంతో విద్యార్థులు పాఠకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూర్చుని చదువుకునేందుకు సరైన స్థలం తాగునీరు ఫర్నిచర్ వంటి కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న గ్రూప్స్ పోలీస్ ఉపాధ్యాయ నియామకాలు తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు అవసరమైన ప్రామాణిక పుస్తకాలు స్టడీ మెటీరియల్ దినపత్రికలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. వాంకిడి గ్రంథాలయానికి శాశ్వత ప్రభుత్వ భవనాన్ని మంజూరు చేసి త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆధునిక డిజిటల్ లైబ్రరీ కంప్యూటర్లు ఇంటర్నెట్ సౌకర్యం ప్రత్యేక రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, సిపిఐ నాయకులు వార్కోల్ రాకేష్, పుప్పిరి వెంకటేష్ పాల్గొన్నారు.

## పోలీసులు మీకోసంలో భాగంగా వాలీబాల్ పోటీలు ప్రారంభం





**ప్రజాపక్షం/బోథ్ :** ఆదిలాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి,పోలీసుప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం బోథ్ మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ మైదానంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను బోథ్ సీఐ డి.గురుస్వామి లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా బోథ్ సీఐ డి.గురుస్వామి మాట్లాడుతూ, యువత శారీరక దృఢత్వం,క్రమశిక్షణ,జట్టు భావన పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు,విద్య,ఉపాధి సాధనపై దృష్టి సారించాలని సూచించారు.బోథ్, సోనాల మండలాలకు చెందిన 24 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు.రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విజేతలకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.ప్రథమ విజేతకు రూ.5,000, ద్వితీయ విజేతకు రూ.3,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.ఈనెల 18న నిర్వహించనున్న గుట్ట పక్క తాండ గ్రామంలో జరగనున్న పోలీసు మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులుఅందజేయనున్నట్లు సీఐ తెలిపారు.ఈకార్యక్రమంలో బోథ్ ఎస్ఐ వి.పురుషోత్తం,ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ వైద్య సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఎల్క రాజు,గ్రామ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్,గ్రామ పెద్దలు, యువకులు,క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్ వితరణ

**ప్రజాపక్షం/తానూర్ :** మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమికోన్నత పాఠశాలకు డాక్టర్ ఆర్.ఎం.పి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రాజు 15వేల రూపాయలు విలువగల మైక్ సెట్ ను బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలకు తన వంతుగా సహాయం చేయడం చాలా సంతోషంగా ఉందని,తను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థినని గుర్తుకు తెచ్చుకున్నారు.పాఠశాలకు మైక్ సెట్ అందించిన డాక్టర్ రాజుకు ప్రధాన ఉపాధ్యాయుడు గంగా చరణ్, ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరేందర్, పాఠశాల చైర్మన్ భోజవ్వ,ఆలయ కమిటీ చైర్మన్ పోశెట్టి,గణేష్,ఉపాధ్యాయ బృందం,తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం

### రెండు రోజులైనా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కాలే

**ప్రజాపక్షం/ముధోల్ :** గత రెండు రోజుల క్రితం తన పంట చేనులోని వవ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు అపహరించారని దానికి సంబందించిన విషయాన్నీ ఇప్పటికే రైతు సునిల్ ఇటు విద్యుత్ శాఖ అధికారులకు, పోలీసులకు రాతపూర్వాకంగా ఫిర్యాదు అందించారు.ట్రాన్స్ ఫార్మర్ దొంగతనం ఫిర్యాదు అందగానే స్థానిక ఎస్సై బిట్ల పెర్సిస్, విద్యుత్ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి సంఘటనను పరిశీలించడం జరిగింది.అయితే ఇప్పటి వరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.వర్షాలు లేకపోవడంతో పంటలకు నీరందించే అవకాశం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి కోసం విద్యుత్ సరఫరా అత్యవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయకపోవడం వల్ల పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తక్షణమే కొత్త వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని బాధిత రైతులు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో దశల వారిగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

**ప్రజా పక్షం/భైంసా :** ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సహకారంతో గ్రామంలో దశలవారీగా అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని ఇలేగాం సర్పంచ్ సిరం రాజమణి శ్రీనివాస్ అన్నారు. భైంసా మండలంలోని గ్రామంలో గ్రామానికి చెందిన దుమ్మోల్ల సత్యబాయి,రెడ్ల శంకుతలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామంలో పెద్ద మొత్తంలో అర్హులు ఉన్నారని ఈ విషయమై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రస్తుతం ఇల్లు లేని నిరుపేదల కోసం ప్రభుత్వం గుడిసెల సర్వే ని చేపట్టిందని,అందులో అర్హులైన వారికి ఇల్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రశాంత్, ఉప సర్పంచ్ శ్రీనివాస్,వార్డు సభ్యులు స్వరూప,కారోబారి అంబదాస్,ఉన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని కోలూర్ గ్రామంలో ఇటీవలే వివిధ కారణాలతో మృతి చెందిన జీపీ కార్మికుడు నగేష్ (30) శేషారావు,(48) కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పరామర్శించి,బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు దోడాడె నగేష్ సహకారంతో, బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయంతో పాటు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు,బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మి రెడ్డి,స్థానిక నాయకులు,ఉప సర్పంచ్,వార్డ్ మెంబర్స్,గ్రామ పెద్దలు యువకులు,తదితరులు పాల్గొన్నారు.

## దిలావర్‌పూర్‌లో అర్ధరాత్రి ఇండ్లలో దొంగతనాలు

**ప్రజా పక్షం /దిలావర్‌పూర్ :** మండల కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన వరుస దొంగతనాలు కలకలం రేపాయి.స్థానికులైన గౌరీ పోశెట్టి ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువా బద్దలుకొట్టి రూ.40 వేల నగదు,ఒక తులం బంగారాన్ని అపహరించారు.అదే సమయంలో సమీపంలోని గారడి ముత్యం ఇంట్లోనూ దొంగతనానికి పాల్పడి రూ.30 వేల నగదును ఎత్తుకెల్లినట్లు బాధితులు తెలిపారు.సమాచారం అందుకున్న ఎస్ఐ రవీందర్ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు.చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరా పుటేజీలను పరిశీలించగా,ముఖాలకు మాస్కులు ధరించిన ముగ్గురు దుండగులు రాత్రి సమయంలో సంచరిస్తున్న దృశ్యాలు నమోదయ్యాయి.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. దుండగులు మాస్కులు ధరించడం వల్ల వారు స్థానికులా లేక బయటి వ్యక్తులా అనే కోణంలో విచారిస్తున్నామన్నారు.

## ఆగస్టు 15లోగా భీమ్‌గల్‌లో నాలుగు ప్రధాన పనులు పూర్తి చేయాలి

బాల్కొండ ఎమ్మెల్యే, ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు, భీమ్‌గల్ బసు డిపో, సిసి, బిటి రోడ్ల నిర్మాణం వంటి కీలక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం కావలనే నిర్లక్ష్యం చేస్తోందని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆగస్టు 15 లోగా నాలుగు ప్రధాన ప్రజాసమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆగస్టు 16 నుంచి మళ్లీ ఉద్యమం ఉధృతం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎమ్మెల్యే వేముల అల్టిమేటం ఇచ్చారు. భీమ్‌గల్ అభివృద్దే లక్ష్యంగా అక్కడి ప్రజల న్యాయమైన హక్కుల సాధన కోసం భీమ్‌గల్‌లో ఎమ్మెల్యే వేముల చేపట్టిన నిరసన దీక్షను భగ్నం చేసేందుకు ఎమ్మెల్యే వేములను పోలీసులు గృహ నిర్బంధం చేసి ఆంక్షలు విధించినప్పటికీ వాటిని లెక్క చేయకుండా వేల్పూర్‌లోని తన నివాసంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు మంచినీరు కూడా ముట్టకుండా కఠిన నిరాహార దీక్ష ఎమ్మెల్యే వేముల నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించి మాట్లాడారు. 2014 కు ముందు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న భీమ్‌గల్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రూపు తీసుకవచ్చామని ఎమ్మెల్యే తెలిపారు. గత పదేళ్లలో రూ.100 కోట్లతో నాలుగు లైన్ల రహదారులు, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, సీసీ రోడ్లు, ఛాంబర్ రోడ్లు, పార్కులు, వైకుంఠధామాలు, నింబాద్రిగుట్ట అభివృద్ధి వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి భీమ్‌గల్ రూపురేఖలు మార్చామన్నారు. అలాగే అన్ని పనులను అభివృద్ధి పర్చామన్నారు.

**దీక్ష విరమణ :** మాజీ కార్పొరేషన్ చైర్మన్, సంఘ సేవకుడు చేయూత ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్ దీక్షకు సంఘీభావం తెలిపి నిమ్మరసం ఇచ్చి ఎమ్మెల్యే వేముల దీక్ష విరమింపజేశారు. దీక్షకు వచ్చి మహిళలు భీమ్‌గల్ పాస్టర్ అసోసియేషన్ వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై సంఘీభావం తెలిపారు. డీసీసీబీ డైరెక్టర శేఖర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

## ఎడపల్లిలో తెరుచుకున్న ఇంటిలోకి చొరబడిన దొంగ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** జ్వరం వల్ల ఇంటి తలపులు వేసుకోకుండా నిద్రపోయిన ఓ మహిళ కార్మికురాలు ఇంటిలోకి గుర్తు తెలియని దొంగ చొరబడ్డాడు. బంగారం, నగదును దొంగలించిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎడపల్లి గ్రామానికి చెందిన బొల్ల సవిత(34) బీడీ కార్మికురాలిగా జీవనం సాగిస్తుంది. గత సోమవారం రాత్రి ఆమె తీవ్రమైన జ్వరంతో భాదపడుతూ ఉక్కపోత, అనారోగ్యం కారణంగా ఇంటి తలుపులు వేసుకోకుండానే నిద్ర పోయింది.

## గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నిర్మల్ విద్యార్థిని 'తన్వి శ్రేష్ఠ'

వాసవి వరల్డ్ స్కూల్ హర్షం



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని వాసవి వరల్డ్ స్కూల్ విద్యార్థిని గుండా తన్వి శ్రేష్ఠ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను సాధించి పాఠశాల కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసింది. హైదరాబాద్‌లో గత ఏప్రిల్ 26న నిర్వహించిన 'అత్యధిక మంది పాల్గొన్న కరాటే ప్రదర్శన' (ఎల్‌కెడి) పోటీలలో పాల్గొని అత్యద్భుత ప్రతిభ కనబరిచిన తన్వి శ్రేష్ఠ.. ప్రతిష్టాత్మక గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ (జిడబ్ల్యుర్) గుర్తింపును సొంతం చేసుకుంది.ఈ విశిష్ట విజయానికి గుర్తింపుగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సంస్థ నుండి అధికారిక ప్రశంసా పత్రం అధికారిక అటెంప్ట్ మెడల్ (ఒఎఎమ్) బుధవారం పాఠశాలలో విద్యార్థినికి అందజేశారు. విద్యార్థిని సాధించిన ఈ అంతర్జాతీయ ఘనత పాఠశాలకే కాకుండా నిర్మల్ జిల్లా మొత్తానికి గర్వ కారణమని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా పాఠశాల సెక్రటరీ జగదీష్ రెడ్డి మరియు ప్రిన్సిపాల్ శైల జాయ్ సన్ మాట్లాడుతూ.. నిరంతర కృషి, క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ప్రపంచ స్థాయిలో అద్భుతాలు సృష్టించవచ్చని తన్వి శ్రేష్ఠ నిరూపించిందని కొనియాడారు. విద్యార్థిని సాధించిన ఈ ఘనత తోటి విద్యార్థులకు ఎంతో స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. వాసవి వరల్డ్ స్కూల్ కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాస రంగాలలో విద్యార్థుల ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి నిరంతరం ప్రోత్సహిస్తోందని వారు స్పష్టం చేశారు.అనంతరం గిన్నిస్ రికార్డ్ విజేత గుండా తన్వి శ్రేష్ఠను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం మరియు తోటి విద్యార్థులు శాలువాతో ఘనంగా సత్కరించి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ అభినందన సభలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుడు వెడ్మ బొజ్జును కలిసిన ఆకుల హరీష్ కుమార్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన ఆకుల హరీష్ కుమార్ బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను,అలాగే నిర్మల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు వెడ్మ బొజ్జ పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సన్మానించారు.నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి ఆకుల హరీష్ కుమార్ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అంకితభావంతో శ్రమిస్తానని స్పష్టం చేశారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా,కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ నిర్మల్ పట్టణంలో పార్టీని మరింత బలీయమైన శక్తిగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.ఆకుల హరీష్ కుమార్ నియామకం పట్ల సంతోషం వ్యక్తం చేసిన పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జ పటేల్‌లు.. ఆయనకు అభినందనలు తెలుపుతూ నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు.నిర్మల్ నియోజకవర్గంలో పార్టీని మరింత ముందుకు నడిపించడంలో ఆయన చురుకైన పాత్ర పోషించాలని దిశానిర్దేశం చేశారు.ఈ భేటీలో పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉద్యమకారులను గుర్తించి ఐడి కార్డులు,పెన్షన్లు ఇవ్వాలి

కేకే, కోదండరాంలకు వినతి పత్రం

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఎలాంటి కాలయాపన చేయకుండా తక్షణమే గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలని తెలంగాణ ఉద్యమ ప్రముఖులు పాకాల రాంచందర్, ఎం.సి. లింగన్న డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని బోట్‌క్లబ్ వద్ద గల తెలంగాణ అమరవీరుల స్తూపం ప్రాంగణంలో ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవ రావు (కేకే) అధ్యక్షతన కీలక సమావేశం జరిగింది.ఈ సమావేశానికి హాజరైన నిర్మల్ జిల్లా ఉద్యమ ప్రముఖులు పాకాల రాంచందర్, ఎం.సి. లింగన్న, విజయ్ కుమార్, కొట్టే శేఖర్ తదితరులు కమిటీ చైర్మన్ కేశవరావును కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అదేవిధంగా అక్కడే ఉన్న శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) ప్రొఫెసర్ కోదండరామ్‌ను కూడా కలిసి తమ సమస్యలను విన్నవించారు.ఈ సందర్భంగా ఉద్యమ నేతలు మాట్లాడుతూ.. స్వరాష్ట్ర సాధన కోసం లాఠీ దెబ్బలు తిని, జైలుపాలై, కుటుంబాలను వదిలి పోరాడిన ఉద్యమకారులందరినీ ప్రభుత్వం త్వరితగతిన గుర్తించాలన్నారు. వారికి తక్షణమే ప్రభుత్వ అధికారిక గుర్తింపు కార్డులు (ఐడీ కార్డ్స్), ఇళ్ల నిర్మాణానికి 250 గజాల స్థలం, అలాగే వారి జీవనోపాధి కోసం నెలవారీ పెన్షన్ తదితర సౌకర్యాలను కల్పించి ఆదుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్క ఉద్యమకారుడికి న్యాయం జరిగేలా కమిటీ చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు గొజ్జ జనార్ధన్,నాగారావు,ఆరే శ్రీకాంత్,ద్యాగ ప్రశాంత్, ఆకోజి కిషన్, లావణ్య, వాజిద్, షరీఫ్,రామ్ లక్ష్మణ్, మోహన్ రెడ్డి, కిరణ్ రెడ్డి,శ్రీనివాస్,శంకర్,అజయ్,తదితర ఉద్యమకారులు,నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రూ.30 లక్షలతో ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/మమడ :** మామడ మండల కేంద్రంలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ (అగ్రికల్చర్ గోదాం) నిర్మాణానికి బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ గోదాం నిర్మాణం పూర్తయిన అనంతరం రైతులకు ధాన్యం నిల్వలో సౌలభ్యం కలగడంతో పాటు, వ్యవసాయ రంగానికి మరింత బలం చేకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పందిరి చంద్రకళ సురేందర్,మండల అధ్యక్షులు రంజిత్, ఉప సర్పంచ్ ప్రవీణ్, నాయకులు బాపు రెడ్డి, రాజారెడ్డి, తో పాటు రైతులు,ప్రజాప్రతినిధులు,అధికారులు,బీజేపీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## బాల కార్మికుడికి విద్యాదానం..

ఆపరేషన్ ముస్కాన్' అధికారుల చొరవతో ఇంటర్‌లో అడ్మిషన్!

**ప్రజాపక్షం/నర్సాపూర్ జి :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా సాగుతున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా నర్సాపూర్ మండల కేంద్రంలో ఓ బాల కార్మికుడికి అధికారులు అండగా నిలిచారు.బుధవారం స్థానిక వెల్డింగ్ షాపులో పని చేస్తున్న బాలుడిని గుర్తించి, అతడికి బాల కార్మిక బంధనాల నుండి విముక్తి కల్పించడమే కాకుండా ఉన్నత చదువుల వైపు అడుగులు వేయించారు.ఆ బాలుడి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక చొరవ చూపారు.సమాజంలో ప్రతి ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణ పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు. ముస్కాన్ బృంద సభ్యులైన పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ యం.అజయ్,కార్మిక శాఖ ప్రతినిధి జి.వినయ్, జిల్లా బాలల న్యాయ సలహాదారు ఎస్. నరేందర్,విజన్ ఎన్‌జీఓ ప్రతినిధి డి.హారిక పాల్గొని విజయవంతం చేశారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేస్తా


నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిష్టయ్య

**ప్రజాపక్షం/ముధోల్ :** రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఇటీవల ముధోల్ మండల అధ్యక్షునిగా ఎన్నికైన కిష్టయ్య అన్నారు.తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షునిగా ఎన్నుకున్నందుకు కాంగ్రెస్ పార్టీకి,తమ నాయకుడైన విట్టల్ రెడ్డికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు.తనకు ఇంతటి స్థానం లభించడానికి పార్టీ శ్రేణులకు సైతం కృతజ్ఞులై ఉంటానన్నారు. ప్రతి ఒక్కరితో సోదరభావంతో మెలుగుతూ పార్టీ పటిష్టానికి ముందడుగు వేయడమే తన ముందున్న లక్షమని వెల్లడించారు. ప్రజల సంక్షేమం కొరకు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లో తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపులో తాను భాగస్వామినవుతానని స్పష్టం చేశారు.

## అర్హతున్న ఒక్క ఓటు తొలగింపోవద్దు

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** నియోజకవర్గ ప్రజలు జూలై 24 లోగా తమ ఓటరు నమోదు ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి కోరారు. అర్హులైన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును పరిరక్షించుకునేందుకు అవసరమైన వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు అత్యంత విలువైన హక్కు అన్నారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలని పీవీఆర్ పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రభుత్వ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచి, కార్మికుల వేతనాలు సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్‌రెడ్డి కి తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా అధ్యక్షులు పి.సుధాకర్ వినతిపత్రం అందజేశారురాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి కార్పోరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని వెయ్యి పడకలకు బోధన్ జిల్లా ఆస్పత్రిని 200 పడకలకు పెంచి కార్మికుల సంఖ్యను పెంచటంతో పాటు వారికి జాతీయ, పండగ ఆర్జిత సెలవులు సంవత్సరానికి 21 అమలు చేయాలని కోరారు.

## గర్భిణీలు, పిల్లలకు ఆరోగ్య పరీక్షలు

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి:** నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ హై స్కూల్‌లోని ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణీలు, పిల్లలకు వైద్యులు బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ రోగులకు మందులు సైతం ఇచ్చామని ఎంపీహెచ్‌ఏ హిమజ తెలిపారు. ప్రతి బుధవారం గర్భిణీలకు, పిల్లలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఏ సరిత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి** : జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని హై స్కూల్‌లో 12మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హై స్కూల్ ప్రిన్సిపల్ లింగన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సోమ, మంగళ, బుధ వారాలలో ఇంటిగ్రేటెడ్ ఇన్ సర్వీస్ టీచర్స్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించామన్నారు. దీంతో ఆరుగురు డిఆర్‌పిలు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొంది 12మండలాలకు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ ను అందించారన్నారు.165మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొన్నారన్నారు. దీనిలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ లక్ష్మీ కాంతం సైతం ఇక్కడి శిక్షణలో ఉపాధ్యాయులకు మోటివేషన్ చేయడం జరిగిందన్నారు. ఆయా పాఠశాలలో ఈ ఉపాధ్యాయులు మరింత మెరుగైన, వృత్తి విద్యా అందించేందు ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గోదావరిలో దూకి ఒకరి ఆత్మహత్య



**ప్రజాపక్షం/-ముప్కాల్** : అప్పుల బాధతో మెండోరా మండలం చాకిర్యాల్ గ్రామ పరిధిలోని సోన్ బ్రిడ్జి పై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సుంకరి నరేష్‌చారి (27) మృతుడు నిర్మల్ జిల్లా సోన్ మండలం సోన్ గ్రామ నివాసుడైన హైదరాబాద్ నుండి కారులో వస్తుండగా అప్పుల బాధతో మనస్థాపం చెంది చాకిర్యాల్ పరిధిలోని సోన్ బ్రిడ్జిపై నుండి దూకి ఆత్మహత్య చేసుకున్నాడని మెండోరా ఎస్సై సుహాసిని తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## బదిలీపై వెళ్లిన పశువైద్యాధికారి



**ప్రజాపక్షం/ఆర్మూర్** : పశువుల ఆరోగ్యం నుంచి రైతుల ఆర్థిక భరోసా కోసం అండగా నిలిచిన వైద్యాధికారి బదిలీ అయ్యారు. మండలంలోని చేపూర్ గ్రామంలో 7 సంవత్సరాలుగా పశువైద్యాధికారిగా సేవలందించిన డాక్టర్ రాజేశ్వర్ సాధారణ బదిలీలో భాగంగా జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వర్ని మండలంలో పని చేసిన జ్యోతి చేపూర్‌కు బదిలీపై వచ్చారు. చేపూర్ పల్లె స్థానిక రైతులు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

# త్వరితగతిన ఫారాలను బిఎల్‌ఓలకు అందజేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్** : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు త్వరితగతిన తమ ఫారంను బిఎల్ఓలకు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వివరాలను డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్/డీలీటెడ్(ఎఎస్‌డి) ఓటర్ల జాబితాను సైతం రూపొందించాల్సి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్ఓలకు అందించాలన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లు ఫారం అందజేసే విషయంలో తాత్సారం చేయవద్దని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారమందించటంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతవుతుందని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా గత 2002 ఎస్ఐఆర్ వివరాలు తెలియకపోతే సర్కిల్ వారిగా నెలకొల్పిన హెల్ప్‌డెస్కును, లేదా బీఎల్ఓలను సంప్రదించాలని సూచించారు. అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపర్చి ఫారం సమర్పించవచ్చన్నారు. అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు.

# నిరాహారదీక్షను అడ్డుకోవడం అప్రజాస్వామికం

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి




**ప్రజాపక్షం/భీమ్‌గల్** : బాల్కొండ నియోజకవర్గం, భీమ్‌గల్ ప్రజల దశాబ్దాల కల అయిన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ తాను తలపెట్టిన శాంతియుత 'కఠోర నిరాహార దీక్ష 'ను పోలీసు బలగాలతో అడ్డుకోవటం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాక్షస చర్య అని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజాసమస్యల సాధన కోసం తాను అహింసా మార్గంలో నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో ఉక్కుపాదం మోపాలని చూడటం శోచనీయమన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై దాదాపు 75 శాతం పనులు పూర్తి చేసుకున్న భీమ్‌గల్ 100 పడకల ఆస్పత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అలాగే, భీమ్‌గల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని, మూతపడిన భీమ్‌గల్ బస్సు డిపోను పునఃప్రారంభించాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల ముందు రూ.12 కోట్ల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పెండింగ్ పనుల సాధన కోసమే 15న చుక్క మంచి నీరు కూడా ముట్టకుండా ఒక రోజు కఠోర నిరాహార దీక్షకు పూనుకున్నట్లు స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఎలాంటి రాస్తారోకోలు, ధర్నాలు చేయకుండా, తనకు తాను శిక్ష వేసుకుంటూ అత్యంత శాంతియుతంగా ఒకరోజు దీక్ష చేస్తానని ప్రకటిస్తే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కి పడుతోందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. తాను ఉదయం నిద్ర లేవక ముందే, కనీసం స్నానం కూడా చేయక ముందే వందలాది మంది పోలీసులు తన ఇంటిని చుట్టుముట్టి తనను బయటకు వెళ్లనివ్వకుండా గృహనిర్బంధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్ట్ చేసి జైళ్లలో పెడుతున్నారని, భీమ్‌గల్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని తొలగించి ఫ్లెక్సీలను సైతం చించేయటం ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమన్నారు.

# ఏడుచోట్ల జరగనున్న శ్రీజగన్నాథ రథయాత్ర



**ప్రజాపక్షం/నిజామాబాద్** : ఇస్కాన్ కంఠేశ్వర్ ఇందూరు నిజామాబాద్ ఆధ్వర్యంలో ఇందూరు జిల్లా వ్యాప్తంగా 7 చోట్ల శ్రీ జగన్నాథ్ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఈ మహోత్సవాలను జయప్రదం చేయాలని ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం అధ్యక్షులు రామానంద రాయ్ గౌరదాస్ కోరారు. బుధవారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షులు రామానంద రాయ్ గౌరదాస్ మాట్లాడారు. జగన్నాథుడు కొలువైన పూరి పట్టణంలో మాదిరిగానే మన ఇందూరు జిల్లాలో శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని 7 వివిధ ప్రాంతాలలో అంగరంగ వైభవంగా ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ రథయాత్రలో పాల్గొని భగవంతుని కృపకు పాత్రులు కావలన్నారు. ఈనెల 16న ఆర్మూర్, 17న బషీరాబాద్,18న ఇందల్వాయి, 19న బోధన్, 20 నవీపేట్, 22న నందిపేట్, 24 ఇందూర్‌లో నిర్వహించే రథయాత్రతో జగన్నాథుడు రథోత్సవాలు పూర్తవుతాయన్నారు. జగన్నాథుడి రథాన్ని లాగడం ద్వారా సమస్త జన్మంతరాలలో చేసిన పాపాలు పరిహారం కావటమే కాకుండా విశేషమైన పుణ్యము, స్వామి అనుగ్రహం లభిస్తాయని, ఎంతోమంది గురువులు తెలిపారు. సమావేశంలో రామానందరాయ్ గౌరదాస్, నితాయ్ చంద్రప్రభు, మాదాసు స్వామి యాదవ్, రఘుపతి, రాధ, రాజగోపికేశదాస్, బలరాం ప్రభు, సునీల్ ప్రభు, రోహిత్ ప్రభు, నవరూప ముకుంద దాస్ పాల్గొన్నారు.

# స్వంత భవన నిర్మాణానికి స్థల పరిశీలన



**ప్రజాపక్షం/భీమ్‌గల్** : భీమ్‌గల్‌లో ప్రతిపాదిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ఆర్ఓ) స్వంత భవన నిర్మాణం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ స్థలాన్ని పరిశీలించారు. ప్రతిపాదిక స్థలం అనుకూలత, విస్తీర్ణం, రవాణా సౌకర్యం, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు స్వంత భవనం నిర్మాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు అభిప్రాయపడ్డారు. త్వరితగతిన అవసరమైన పరిపాలనా ప్రక్రియలు పూర్తి చేసి నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్థల పరిశీలనలో సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ చైర్మన్ కన్నె సురేందర్, వైస్‌చైర్మన్ జెజె నర్సయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నాగేంద్రబాబు, కౌన్సిలర్ సందీప్ పాల్గొన్నారు.



## కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ వర్ధంతి

**ప్రజాపక్షం/మోర్తాడ్** : నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో బుధవారం రోజు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభను సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మోర్తాడ్ మండల కేంద్రంలో రాయల చంద్రశేఖర్ వర్ధంతి సభను జరిపారు. ఈ సందర్భంగా అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. తనకోసం తన పని చేసుకోవడమే కాదు సమాజంలో బడుగు బలహీన వర్గాల కొరకు నిరంతరం పోరాటం చేసిన వ్యక్తి కామ్రేడ్ రాయల చంద్రశేఖర అని అన్నారు. సమాజం మార్పు కోసం పని చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. పోడు భూముల సమస్యల పరిష్కరించాలని గిరిజన గ్రామాలు తిరుగుతూ గిరిజనులను ఏకం చేసి భూ పోరాటాలు నడిపారన్నారు. కోవిడ్ సందర్భంగా ఢిల్లీ సరిహద్దుల్లో జరుగుతున్న పోరాటానికి తనవంతు కర్తవ్యంగా ఆ పోరాటంలో పాలు పంచుకున్న చంద్రశేఖర్ ఆశయాలను ముందుకు తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం దయాల్ సింగ్ బాబన్న, లత, గంగాధర్, చిన్నమ్మ, చిన్నక్క, రాజేశ్వర్, పోశెట్టి, గంగారాం, చిన్న రాజన్న, ముకుందం శోభన్ పాల్గొన్నారు.

## ఎడపల్లి మండల కేంద్రంలో ఉపాధ్యాయుల నిరసన

ఆరు డిఎలు, ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/ఎడపల్లి** : నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని వీడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిటిఎఫ్ అధ్యక్షులు బి.స్వామి నాయక్, పండిత పరిషత్ అధ్యక్షులు మహమ్మద్ జమీల్లుల్లా, టిఆర్‌టిఎఫ్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, పిఆర్‌టియు నాయకులు సతీష్ వ్యాస్, దేవానంద్ రెడ్డిలతో పాటు తపస్ సుదర్శన్, శివరాజన్, త్రిలోచన రావు, వసంత రావు, శ్రీమన్నారాయణ చారి, గంగాధర్, శంకర్ తదితర ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## పట్టు చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షుడికి సన్మానం

**ప్రజాపక్షం/ఆర్మూర్** : పట్టణంలో ఇటీవల గెలుపొందిన పట్టు చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు షికారి శ్రీనివాస్‌ను బీజేపీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ ఆర్మూర్ పట్టణ శాఖ అధ్యక్షులు మందుల బాలు ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంచెట్టి గంగాధర్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు పోల్కం వేణులు పట్టు చేనేత సహకార సంఘం ఎన్నికలలో ఏకగ్రీవంగా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన షికారి శ్రీనివాస్‌ని శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బోవేకర్ పాస్ శ్రీనివాస్, బొట్టు రాజు, దొండి ఈశ్వర్, శ్రావణ్, పోచంపాడ్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు జెస్సు అనిల్, యుగంధర్, వివేకానంద్, చెన్నారెడ్డి, కలిగోట ప్రశాంత్, చిట్టి భాజన్న, గోపి, అశోక్, నారాయణ, దశరథ్ పాల్గొన్నారు.